క్లుప్తంగా

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్యాంకర్



ఓ ఇంటి నిర్మాణం వద్ద ఉన్న పంచాయతీ వాటర్ ట్యాంకర్

దుమ్ముగూడెం: మండలంలోని కాశీనగరం గ్రామపంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌ను ప్రైవేటు పనులకు ఉపయోగిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం పంచాయతీకి చెందిన వాటర్ టాంకర్ గ్రామంలో ఓ ఇంటి నిర్మాణంలో స్లాబ్ పనులు చేస్తుండగా అక్కడ నీటి సరఫరా కోసం ఉపయోగించారు. పంచాయతీ పనులకు ఉపయోగించాల్సిన వాటర్ ట్యాంకర్‌ను ఇలా ప్రైవేట్ పనులు ఉపయోగించడంపై పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్రవంతిని వివరణ కోరగా.. తనకు తెలియకుండా ట్యాంకర్‌ను తీసుకెళ్లారని, విషయం తెలియగానే తెప్పించి పంచాయతీ కార్యాలయం వద్ద పార్కింగ్ చేయించామని తెలిపారు.

సభను విజయవంతం చేయండి

దుమ్ముగూడెం: ఖమ్మంలో జూలై 2వ తేదీన నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ పిలుపునిచ్చారు. గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జులై 2 ఆదివారం నాడు ఖమ్మంలో జరగనున్న తెలంగాణ జనగర్జన సభకు దుమ్ముగూడెం మండలం నుండి భారీ ఎత్తున జనం కదిలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు బత్తుల శోభన్ బాబు, సీనియర్ నాయకులు పూజారి సూర్యచందర్ రావు, నర్సాపురం సర్పంచ్ వర్ష శివరామకృష్ణ, గంగోలు సర్పంచ్ మడకం చంద్రశేఖర్, నాయకులు అంగడాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులకు గురువారం అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం భూమిపూజ చేశారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో మండల కేంద్రంలో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. గతంలో డిసెంబర్ 5న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే రేగా శంకుస్థాపన చేశారు. వర్షాకాలం దృష్ట్యా పనులు వేగవంతం చేసి డ్రెయినేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల కేంద్ర వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చందూలాల్, గాదె కేశవరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

భద్రాచలంటౌన్: ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేసి తెలంగాణలో అధికారం సాధించే దిశగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర విస్తారక్ పీవీ రాఘవులు అన్నారు. భద్రాచలం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి నివాసంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కార్యకర్తలు బూత్ స్థాయిలో పని విభజన చేసి 11 మందితో కమిటీ ఏర్పాటు చేయాలని, పట్టణంలోని 39 పోలింగ్ బూతులలో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశం అనంతరం పట్టణంలోని పలు కాలనీలలో ఇంటింటికీ బీజేపీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుంజా ధర్మ, జిల్లా కార్యదర్శి నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్‌రావు, సత్యనారాయణ, వెంకన్న, చక్రవర్తి, శ్రీను, సుదర్శన్, వెంకటసుబ్బయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జనగర్జన సభకు తరలిరావాలి

మణుగూరురూరల్: పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా జూలై 2వ తేదీన ఖమ్మంలో జరిగే జనగర్జన మహాసభకు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సభకు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐఎన్‌టియుసి, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, కె.సత్యనారాయణ, మాధవరావు, బి.శివ, లతీఫ్, లాలు, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

త్యాగానికి, దైవానుగ్రహానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదిన వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్‌లు చేశారు. కొన్ని చోట్ల వర్షం కారణంగా మసీదుల్లోనే ప్రార్థనలు కొనసాగాయి. ఈ సందర్భంగా కుర్బానీ గొప్పతనం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాకు వేడుకుని దువా చేశారు. ఒకరినొకరు అలాయ్ బలాయ్ చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాలకు మతపెద్దల నేతృత్వం వహించగా.. మసీద్ కమిటీ బాధ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చంద్రుగొండ: మండల కేంద్రంలోని మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కరకగూడెం: కోఆప్షన్ సభ్యుడిని ఆలింగనం చేస్తున్న విప్ రేగా కాంతారావు



అన్నపురెడ్డిపల్లి: మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



మణుగూరురూరల్: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



దుమ్ముగూడెం: ముస్లింలతో సీఐ దోమల రమేష్



అశ్వాపురం: జామా మసీదులో..



భద్రాచలంటౌన్: పట్టణంలో ప్రార్థనలు

సేవ చేయడంలోనే తృప్తి



బీపీ చెక్ చేయించుకుంటున్న విప్ రేగా కాంతారావు

కరకగూడెం: పేదలకు సేవ చేయడంలో ఎనలేని తృప్తి దాగి ఉంటుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుడిగా పని చేస్తున్న డాక్టర్ బైరిశెట్టి దుర్గ నరేష్ గురువారం తన స్వగ్రామమైన కరకగూడెంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశాలను విప్ ప్రారంభించి మాట్లాడారు. మారుమూల ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించాలన్న ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ దుర్గ నరేష్‌ను శాలువాతో సన్మానించారు. వైద్యుడు దుర్గ నరేష్ మాట్లాడుతూ.. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 10గంటల వరకు ప్రజలకు ఉచితంగా సేవలను అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలోఎంపీపీ రేగా కాళిక, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మరణం బాధాకరం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ గుండెపోటుతో మరణించడం తీవ్ర బాధాకరమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సాయిచంద్ మృతి పట్ల ఆయన గురువారం సంతాపం వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఒక గొప్ప కళాకారుడిని కోల్పోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పనర్‌నిర్మాణంలో సాయిచంద్ కీలకంగా వ్యవహరించారన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



మణుగూరురూరల్: హోమం నిర్వహిస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో తొలి ఏకాదశి పర్వదినం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఆలయాలలో పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఆషాడ మాస తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉదయాన్నే నిద్రలేచి ఇళ్లువాకిళ్లను శుభ్రం చేసుకుని స్నానాలు ఆచరించారు. నూతన వస్త్రాలు ధరించి ఇంట్లోని దేవుని పటాలకు పూజలు చేశారు. అనంతరం దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను, స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమితిసింగారం గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో, లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్‌లో ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం సీతారామచంద్ర స్వామివారికి రామాలయ అర్చకుడు కోటి రామస్వరూప్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో సీతారామచంద్ర స్వామివారి మూర్తులను కొలువుదీర్చి, విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, కంకణధారణతో పాటు పలు పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో డాక్టర్ మురళికృష్ణ, మైథిలి, అన్నపూర్ణ,ఈశ్వరి, భాస్కర్‌రావు, ప్రభావతి, రాజాశ్రీనివాస్, కల్యాణి పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: బాలాజీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మణుగూరురూరల్: భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఇసుకరీచ్ వద్ద ధర్నా

బూర్గంపాడు: నాగినేనిప్రోలు గ్రామపంచాయతీలోని పాతగొమ్మూరు ఇసుక రీచ్ వద్ద గ్రామానికి చెందిన గిరిజన మహిళలు గురువారం ధర్నా చేశారు. ఆరు నెలలుగా ఇసుకరీచ్ నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులకు బోనస్‌లు ఇవ్వటం లేదని, ఇసుక రీచ్ నిర్వహణకు కూడా సక్రమంగా లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బోనస్‌లు వెంటనే చెల్లించాలని లేకుండా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వాసవీ క్లబ్ వితరణ

బూర్గంపాడు: సారపాక గాంధీనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు వాసవీ క్లబ్ సారపాక గ్రేటర్ ఆధ్వర్యంలో వితరణ అందించారు. శాకంబరీ ఉత్సవాల్లో అమ్మవారి అలంకరణకు అవసరమైన పట్టువస్త్రాలను వాసవీ క్లబ్ ప్రతినిధులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కంచర్ల వీరభద్రరావు, కేతపల్లి భవాని, బచ్చు సతీష్, పచ్చిపులుసు లక్ష్మీతేజ, కేదారిశెట్టి సోమేశ్వరరావు, కేతేపల్లి ప్రవీణ్, రేపాక రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా జహీరుద్దీన్

ములకలపల్లి: ములకలపల్లి మసీదు కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ జహీరుద్దీన్ నియమితులయ్యారు. ములకలపల్లిలో గురువారం జరిగిన మస్జీద్–ఏ ఫిర్‌దోస్ సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా జహీరుద్దీన్, ఉపాధ్యక్షుడిగా షేక్ మైనుద్దీన్, ట్రెజరర్‌గా షేక్.జబ్బార్, చీఫ్ అడ్వయిజర్‌గా మహమ్మద్ నజీరుద్దీన్‌లతో పాటు కమిటీ సభ్యులుగా రఫీ, అహ్మద్‌పాషా, కరీం, యాకూబ్‌పాషా, షరీఫ్, గౌస్, ముబారక్, తౌసిఫ్, తాజ్ సాహెబ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

చంద్రుగొండ: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఖమ్మంలో గురువారం కలిశారు. జులై 2వ తేదీన కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొననున్న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించేందుకు రేవంత్‌రెడ్డి ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు రేవంత్‌రెడ్డికి వివరించినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమోతు రమణ, కొదుమూరి దయాకర్‌రావు, బొర్రా సురేష్, సంక కృపాకర్, బుంగా శ్రీను పాల్గొన్నారు.

పండ్లు, నిత్యావసరాలు అందజేత

భద్రాచలం: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారస్తులు యెర్ర అనీత గురువారం దుమ్ముగూడెం, చర్ల మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో నిత్యవసర సరుకులను, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలి ఏకాదశి పండుగ రోజున గిరిజన గ్రామాల్లో వారి ఆకలిని తీర్చటం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు పెద్ద ఎత్తున తమ సంస్థ తరుపున చేయటానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ములకలపల్లి: అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోడు పట్టాల పంపిణీ చేపట్టనున్న సందర్భంగా మండలపరిధిలోని కమలాపురంలో గురువారం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కమలాపురం వాసుల లోలెవల్ చప్టాల సమస్యను పరిష్కరించేందుకు 4.5 కోట్ల వ్యయంతో మూడు బ్రిడ్జీలను నిర్మిస్తున్నట్లు వివరించారు. మండలవ్యాప్తంగా సుమారు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. తొలుత ప్రధానకూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద బీఆర్ఎస్ పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. స్థానిక నాయకులతో కలసి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం స్థానిక మహిళలతో కలసి బతుకమ్మ లాడారు. ఈసందర్భంగా మాజీ వైస్‌ఎంపీపీ గోలి రమణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు బిక్కుమళ్ల సుధాకర్‌లను బీఆర్ఎస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సర్పంచ్ గొల్ల పెంటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, గ్రామశాఖ అధ్యక్షుడు ఊరబెద్ది వెంకన్న, ఎంపీపీ మట్ల నాగమణి, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ శనగపాటి మోహరమణి, నాయకులు పువ్వాల మంగపతి, పుష్పాల చందర్‌రావు, ఇనుగంటి రాము, బండి కొమరయ్య, పర్వతనేని అమర్‌నాథ్, బాల అప్పారావు, అడపా నాగేశ్వరరావు పామర్తి వెంకటేశ్వరరావు, పాలకుర్తి ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విస్తృత పర్యటన..



ములకలపల్లి: బీఆర్ఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలోని లంకాలపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తులతో మమేకమై, వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. తమ వ్యవసాయ భూములు, సీతారామ ప్రాజెక్ట్ కాలువకు అవతల పక్క ఉండటంతో కాలువ దాటి వెళ్లడం చాలా కష్టతరంగా ఉందని, కాలువపై ఒక వంతెన నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఐబీ డిపార్ట్‌మెంట్ ఈఈ సురేష్‌తో ఫోన్‌లో మాట్లాడి, వంతెన నిర్మాణానికి కావలసిన అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం అదే గ్రామంలో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అమ్మోజి అను మహిళను పరామర్శించి, ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, సోడెం గంగరాజు, కాకా భరత్, కాకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం

మణుగూరురూరల్: ఆరోగ్యకరమైన జీవనానికి ఔషధ మొక్కలు ఎంతగానో దోహదపడతాయని బౌద్ధ అభిమాని మంగీలాల్ అన్నారు. ఔషధ మొక్కల పంపిణీ, వాటి ప్రయోజనాలపై ప్రజలకు ప్రచారం నిర్వహించాలని కోరుతూ ఏరియా ఎస్‌ఓటు జీఎం వి.కృష్ణయ్యకు గురువారం బౌద్ధ అభిమానులు వినతిపత్రం అందజేశారు. తొలుత వారు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఓటూ జీఎం కృష్ణయ్యకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ అభిమానులు గోవింద శ్రీనివాస్, ఎం.హౌసింగ్, టి.రామకృష్ణ, శివరామకృష్ణ, గోపి పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి ఇటుకల అందజేత

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గురువారం ఏకాదశి పురస్కరించుకుని సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ప్రతీ ఇంటి నుంచి ఇటుకను తీసుకొచ్చి అందజేశారు. ప్రజలు, మహిళలు భారీ ఊరేగింపుగా రామనామ స్మరణతో గర్భగుడి నిర్మాణానికి ఇటుకలు అందజేశారు. రామాయణంలో చెప్పిన విధంగా ప్రతి ఇంటి నుంచి ఇటుకను ఇస్తే ఆ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉంటారనే నానుడిని ప్రకారం ప్రజలను భాగస్వామ్యం చేసినట్లు సర్పంచ్, నిర్వాహకులు తెలిపారు.



ఇటుకలతో ఊరేగింపుగా వస్తున్న సర్పంచ్ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, గ్రామస్తులు

సీపీఎంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: ప్రజా పోరాటాల రథసారథి సీపీఎం గెలుపుతోనే భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఎం భద్రాచలం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు కొనసాగాయి. 'పార్టీ నిర్మాణం–కర్తవ్యాలు'పాఠ్యాంశాన్ని మచ్చా వెంకటేశ్వర్లు బోధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందుతున్నాయని విమర్శించారు. చివరగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి ప్రసంగించారు. ఈ శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి వ్యవహరించగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం. రేణుక, సున్న గంగా, పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు బి. వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, డి.లక్ష్మి, జ్యోతి, జీవనజ్యోతి, కుంజా శ్రీనివాస్, కోరాడ శ్రీనివాస్, లక్ష్మణ్, భూపేంద్ర, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు

దమ్మపేట: గురువారం దమ్మపేట గ్రామంలోని సీపీఎం కార్యాలయంలో మండల స్థాయి పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను మోరంపూడి పుల్లారావు చేతులమీదుగా ఆవిష్కరించారు. శిక్షణా తరగతుల్లో మతం, మతోన్మాదం, సీపీఎం పుట్టుక గురించి వివరించారు. శిక్షకులుగా రేపాకుల శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

కాలువ నిండా చెత్తే!



మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు శివారులో ఉన్న వరద నీటి కాలువ మొత్తం చెత్త, చెదారం, వ్యర్థాలతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. దమ్మపేట గ్రామం నుంచి సాయన్నరావుపాలెం వెళ్లే రోడ్డు మార్గంలోని ఆరోగ్య ఉప కేంద్రానికి అతి సమీపంలో ఉన్న వరద కాలువ పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయింది. వర్షకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు అంతా ఈ కాలువ ద్వారానే ప్రయాణించి దిగువ ప్రాంతంలో ఉన్న చెరువులోకి చేరుతుంది. ఈ నేపథ్యంలో ఈ వ్యర్థాలు స్థానికంగా కలుషితం చేయడంతోపాటు దిగువ ప్రాంతానికి చేరే అవకాశం ఉంది. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి కాలువలోని చెత్త, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– దమ్మపేట

ప్రశ్నించాల్సిన అధికారి: ప్రవీణ్, దమ్మపేట పంచాయతీ కార్యదర్శి
ఫోన్ నంబర్: 9398182311